క్లుప్తంగా

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే శిబిరాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొని విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు తమవంతు సహాయం చేస్తామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 45 మంది పిల్లలు స్క్రీనింగ్ పరీక్షలకు హాజరవగా, 40 మంది పిల్లలను అర్హులుగా గుర్తించారు.

సచివాలయాలలో దివ్యాంగుల సర్టిఫికెట్లు

చీమకుర్తి: దివ్యాంగుల నూతన వైద్య ధ్రువీకరణ పత్రాలు సచివాలయాలలో అందుబాటులో ఉన్నాయని దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు షేక్ మహ్మద్ రఫీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల వైకల్యానికి సంబంధించిన వైద్య పరీక్షల అనంతరం నూతన పర్సంటేజీలతో కూడిన ధ్రువీకరణ పత్రాలు దివ్యాంగులకు సమీపంలోని సచివాలయాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక నుంచి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు నూతనంగా జారీ చేసిన పర్సంటేజీ సర్టిఫికెట్లను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

బధిరులకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలో భర్తీ చేయనున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నియామకాలలో విభిన్న ప్రతిభావంతులకు నాలుగు శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని ప్రకాశం జిల్లా బధిరుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజేంద్ర సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకూ ఈ రిజర్వేషన్‌లు అమలు చేయకపోవడంతో విభిన్న ప్రతిభావంతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో బధిర సంఘ నాయకులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడిని అరెస్టు చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: ఎనిమిది సంవత్సరాల బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.సుజన్ మాదిగ మాట్లాడుతూ దొండపాడు గ్రామానికి చెందిన దొండపాటి బ్రహ్మయ్య అనే వ్యక్తి ఈ దారుణానికి పాల్పడ్డాడని ఆరోపించారు. సంఘటన జరిగి 10 రోజులు గడుస్తున్నా నిందితుడిపై ఎటువంటి చర్యలు లేవన్నారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీని కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బాధిత బాలిక, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు దర్శిలో దివ్యాంగుల వైద్య శిబిరం

దర్శి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీన దివ్యాంగుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓలు బీ రమాదేవి, కె.రఘురామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి 17 ఏళ్లలోపు వయసు గల దివ్యాంగులను పరీక్షించి, ఉపకరణాలు అవసరమైన వారిని నిర్ధారించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డు, యూడీఐడీ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9492123223, 8919015707ను సంప్రదించాలని సూచించారు.

కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు తగదు

- ఒంగోలు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వ్యాఖ్యలకు నిరసనగా కార్మికుల ధర్నా
- కార్మికుల సమస్యలపై అధికారులు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలపై సీఐటీయూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల పట్ల మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ప్రవర్తన అత్యంత దారుణంగా ఉందంటూ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులు కొంతకాలంగా ఆందోళనలు, నిరసనలు చేస్తుంటే పరిష్కరించకపోగా కార్మికులను దుర్భాషలాడటం ఏంటని మండిపడ్డారు. గొడ్డు మాంసం తినేవాళ్లతో తాము మాట్లాడమని.. కార్మికులు చెత్త మాటలు మాట్లాడతారని కార్మికులను అవమానించే విధంగా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం పరిసరాలను శుభ్రం చేసే కార్మికుల సమస్యలు పరిష్కరించని మున్సిపల్ అధికారులు.. కార్మికులపై ఆరోపణలు చేస్తూ రాజకీయ ముద్ర వేసి పని నుంచి తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. మీరు ఆగిపోండి.. మేము వేరే వాళ్లని విధుల్లోకి తీసుకుంటామని మున్సిపల్ అధికారులు మాట్లాడటం దారుణమన్నారు. వార్డులు, డివిజన్లు మార్పు చేస్తున్నారని, మున్సిపల్ కమిషనర్ చుట్టూ తిరిగి వినతిపత్రాలు ఇచ్చినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్మికులు వేతనం కోల్పోయి మానసిక ఒత్తిళ్లకు గురై హాస్పిటల్ పాలవుతున్నారని, మున్సిపల్ అధికారులు కార్మికులపై ఒత్తిళ్లు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై మున్సిపల్ అధికారులు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహం, టీ విజయమ్మ, రాగే రాములు, లక్ష్మీకాంతం, కోటేశ్వరి, కే మోహన్‌రావు, బి.కోటేశ్వరరావు, కే వంశీ, దివ్య, అనిత, కే పద్మ, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమాన్ని అటకెక్కించడమేనా సుపరిపాలన.?

చీమకుర్తి: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు గతేడాది కేటాయించిన రూ.314 కోట్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా ఏడాది పూర్తయ్యే వరకు ఉండి వాటిని రద్దు చేసి అవే నిధులను ఈ సంవత్సరం లెక్కల్లో చూపించడమేనా కూటమి ప్రభుత్వ సుపరిపాలన అంటూ దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ధ్వజమెత్తారు. సోమవారం చీమకుర్తిలోని ఒక కార్యక్రమంలో పాల్గొనటానికి వచ్చిన ఆయన.. స్థానిక మాల మహానాడు నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. కూటమి పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లోకేష్ కొత్తగా కనిపెట్టిన తల్లికి వందనం కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ నిధులు మళ్లిస్తారా..? అంటూ నిలదీశారు. సబ్సిడీ రుణాల మంజూరులో బీసీలు, ఓసీలకు 50 సంవత్సరాల వయసు, ఎస్సీలకు మాత్రం 60 ఏళ్ల వయసా అంటూ ప్రశ్నించారు. దళితుల శ్మశానాలకు సెంటు భూమి కేటాయించడం లేదుగానీ.. కరేడు, కనిగిరి పరిశ్రమల దారులకు మాత్రం వందలాది ఎకరాలు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీల బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకాలను పట్టించుకోవడం లేదన్నారు. కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాల ఊసే లేదన్నారు. దళితుల దాడులపై కేసులకు బదులుగా కౌంటర్ కేసులు పెట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు పేరం శ్రీనివాసరావు, పిన్నిక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి బూచేపల్లి ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

ముండ్లమూరు(దర్శి): అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన నిరు పేద వ్యక్తి కుటుంబానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. ముండ్లమూరు మండలం పోలవరం గ్రామంలో ఇటీవల ప్రమాదంలో కాలిపోయిన నంబూరి జార్జ్ ఇంటిని సోమవారం ఎమ్మెల్యే బూచేపల్లి పరిశీలించి ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ చింత శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిన్నికను పరామర్శించిన ఎమ్మెల్యే బూచేపల్లి



పిన్నిక శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: ప్రజాసంఘాల నాయకుడు పిన్నిక శ్రీనివాసరావును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి సోమవారం పరామర్శించారు. శ్రీనివాసరావు భార్య విజయమ్మ మున్సిపల్ వర్కర్‌గా పనిచేస్తూ వారం క్రితం బైకు ఢీకొట్టడంతో మృతిచెందింది. విజయమ్మ దశదిన కర్మ సందర్భంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పిన్నిక శ్రీనివాసరావును పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బూచేపల్లి వెంట జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, ఆముదాలపల్లి రామబ్రహ్మం, తెల్ల మేకల గాంధీ ఉన్నారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు తన సభ్యులతో కలిసి పిన్నిక శ్రీనివాసరావును పరామర్శించారు.

రోడ్డు పక్కన ఎండిన చెట్లను తొలగించాలి



కర్నూలు రోడ్డు పక్కనున్న ఎండిన చెట్టు

చీమకుర్తి: కర్నూలు రోడ్డుకు ఇరువైపులా చీమకుర్తి – ఒంగోలు మధ్యలో ఉన్న ఎండిన చెట్లను తొలగించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర నాయకుడు గండా శ్రీనివాసరావు సోమవారం ఒంగోలులో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. దాదాపు 28 వరకు ఎండిన చెట్లు ఉన్నాయన్నారు. వర్షాకాలం కావడంతో రోడ్డు మీద వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొందని అన్నారు. అందువలన వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

చీమకుర్తిలో బార్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

చీమకుర్తి: బార్ అండ్ రెస్టారెంట్ నూతన పాలసీలో భాగంగా చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ఒక బార్‌కు అనుమతి లభించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఆసక్తి కలిగిన మద్యం దుకాణాల యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయంలో నోటిఫికేషన్ ప్రదర్శించినట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 26వ తేదీలోపు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు సబర్బన్: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర వెంకటేశ్వరరావు ఆదేశించారు. నగరంలోని వార్డు సచివాలయాల సిబ్బందిని ఆయన అప్రమత్తం చేస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బందితో కలిసి నగరంలో ప్రధాన డ్రైనేజీ, మురికినీటి కాలువలను యుద్ధప్రాతిపదికన పరిశీలించి వాన నీరు ఎటువంటి అవరోధం లేకుండా పోతురాజు కాలువ, నల్ల కాలువలలో కలిసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల సందర్భంగా ఏవైనా అవాంతరాలు తలెత్తితే వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల అవసరార్థం నగరపాలక సంస్థలో ఫోన్ నంబరు : 08592-227766ను ఏర్పాటు చేశామని, 24/7 సిబ్బందిని నియమించి ప్రజల నుంచి వచ్చే సమస్యలు, సూచనలు స్వీకరించి పరిష్కరించేలా ఏర్పాట్లు చేశామని కమిషనర్ వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



పూర్వ విద్యార్థులు అందజేసిన ఫ్రీజర్

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో సీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సోమవారం ఆ పాఠశాలకు ఫ్రీజర్ అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం సత్యవతి తెలిపారు. పాఠశాలలో 1982–83లో 10వ తరగతి చదివిన విద్యార్థులు చీమకుర్తి మిడ్ వెస్ట్ గ్రానైట్ వారి సహకారంతో రూ.70 వేల విలువైన ఫ్రీజర్ అందజేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా తపాళ్ల బుజ్జి అనే పూర్వ విద్యార్థి రూ.21 వేల విలువైన స్టీల్ వాటర్ ట్యాంకు అందజేసినట్లు తెలిపారు.

రామేశ్వర దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

నాగులుప్పలపాడు: స్థానిక రామేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో సుబ్బారావు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ సమక్షంలో దేవస్థానం ట్రస్టు చైర్మన్ ఫౌండర్‌గా ఉప్పలపాటి వెంకటరత్నంతో పాటు సభ్యులుగా మరో 9 మంది ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చీదర్ల పెదయోగయ్య 4వ వర్ధంతి సందర్భంగా అతని కుమారుడైన వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు చీదర్ల శేషు మండలంలోని అయ్యప్ప రాజుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు సోమవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి పాల్గొని వాటిని విద్యార్థులకు అందించారు. పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో చిన్నపురెడ్డి పాపిరెడ్డి, చీదర్ల వెంకటరావు, శ్రీను, రమణయ్య, ధర్నాసి అచ్చయ్య, చిరంజీవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు



పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ ఏఈ, ఈఓపీఆర్‌డీ

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రధాన అధ్యాపకుడు చంద్రశేఖర్ కోరిన క్రమంలో ఎంపీడీఓ వి.జ్యోతి సోమవారం పంచాయతీరాజ్ ఏఈ రవిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, ఈఓపీఆర్‌డీ రఘుబాబుతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. గతంలో ఉన్న కాలువలపై పక్కా నిర్మాణాలు ఉండటం చూసి ఆమె ఆశ్చర్యపోయారు. కాలువలపై అక్రమ నిర్మాణాలే నీటి నిల్వకు ప్రధాన కారణంగా మారిందని ఏఈలు తెలపడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

చెరువును తలపిస్తున్న రహదారి



యల్లయ్యనగర్ వద్ద ప్రధాన రహదారి దుస్థితి

చీమకుర్తి రూరల్: ఒంగోలు – కర్నూలు రోడ్డుపై మండలంలోని యల్లయ్యనగర్ వద్ద ప్రధాన రహదారి మీద గోతులు ఏర్పడి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షం కురిసినా ఆ గోతుల్లో భారీగా నీరు చేరి చెరువును తలపిస్తోంది. వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయంపై మొలిచిన చెట్లు



మండల పరిషత్ కార్యాలయంపై నిల్వ ఉన్న వర్షం నీరు, పిట్టగోడకు చెట్లు



రెవెన్యూ కార్యాలయం గోడకు చెట్లు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులోని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై చెట్లు పెరగడంతో గోడలు నెర్రలు ఇస్తున్నాయి. మండల పరిషత్, వెలుగు, రెవెన్యూ కార్యాలయాలపై కొన్ని రోజుల నుంచి చెట్లు పెరుగుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయం స్లాబ్‌పై చిన్నపాటి వర్షం కురిసినా నీరు పైపులకు చెత్తచెదారం అడ్డుపడి కిందకు పోలేక అక్కడే నిలిచిపోతున్నాయి. స్లాబ్‌పైన మురుగు నీరుగా తయారై దుర్వాసన వెదజల్లుతోంది. అక్కడ దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. కార్యాలయాల గోడల్లో మొలిచిన చెట్లు పెద్దదయ్యే కొద్దీ గోడలు నెర్రలు ఇచ్చి వర్షం నీరు లోనికి వెళ్లి శిథిలావస్థకు చేరుకున్నాయి.

వర్షం కురిసినప్పుడల్లా నీరు గోడల్లోకి పోతుండటంతో పాచి పడుతోంది. చాలా రోజుల నుంచి గోడలో ఉన్న చెట్టును పీకేయాలనే ఆలోచనే అధికారులకు రాలేదు. లక్షలు ఖర్చు పెట్టి ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే వాటిపై శ్రద్ధ వహించకుండా అలాగే వదిలేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు నిత్యం విధులు నిర్వహిస్తుంటారు. చెట్టు వేర్లు చొచ్చుకొని పెద్దదిగా పెరుగుతూ గోడ విచ్చుకొని నెర్రెలు ఇచ్చే కొద్దీ శిథిలావస్థకు చేరుకొని ప్రమాదానికి దారి తీస్తుందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవనాలు శిథిలావస్థకు చేరక ముందే చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ ఫెడరేషన్ కుటుంబ సంక్షేమ నిధి అందజేత



కుటుంబ సంక్షేమ నిధి అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని పెద్దబొమ్మలాపురం స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చెవుల సత్యనారాయణ మృతి చెందిన నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. మొద్దు నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ వీరారెడ్డి యూటీఎఫ్ సంక్షేమ నిధి నుంచి రూ.2 లక్షలను సత్యనారాయణ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రభాకర్, మహంత నాయక్, గౌరవ అధ్యక్షులు వర్దన్, మహిళా అధ్యక్షురాలు రవణమ్మ, సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయులు షరీఫ్, సుధాకర్, మంతన్న యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు తరలి రండి

యర్రగొండపాలెం: జిల్లా కేంద్రమైన ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహా సభలకు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య సోమవారం పిలుపునిచ్చారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరిగే మహా సభల సందర్భంగా 23వ తేదీ సాయంత్రం నెల్లూరు బస్టాండ్ మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రదర్శనంగా బయలుదేరి అద్దంకి బస్టాండ్ కొత్తమార్కెట్ మైదానం వరకు సాగుతుందని, అక్కడ జరిగే బహిరంగ సభలో జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని మాట్లాడుతారని తెలిపారు. ఈ సభల్లో రాజకీయ, సామాజిక, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, దేశ సమైక్యత, సమగ్రత, రాష్ట్ర విభజన హామీల అమలు, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, పారిశ్రామిక అభివృద్ధి, విద్యార్థి, యువజన, శ్రామిక, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి లాంటి అంశాలపై చర్చిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.